

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీచేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ విభాగం కింద జిల్లా వ్యాప్తంగా 10 నెట్‌వర్క్ ఆస్పత్రులపై 18 మంది రోగులు ఐవిఆర్ ద్వారా అందించిన ఫిర్యాదుల మేరకు కమిటీ విచారణ చేపట్టింది. అందిన ఫిర్యాదులను పరిశీలించి నెట్వర్క్ హాస్పిటల్స్, హాస్పిటల్ వైద్యులు, యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘించి డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవల్లో అదనపు వసూళ్లకు పాల్పడిన వారిపై అపరాధ రుసుంవిధించినట్లు పేర్కొన్నారు. రోగుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని వారికి తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కొప్పర్తికి టెక్నోడోమ్!

రూ.55 కోట్లతో పరిశ్రమ రాక
ఎనిమిది ఎకరాలు కేటాయింపు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడలో టెక్నోడోమ్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. రూ.55.21 కోట్లతో ఐదు ఎకరాల్లో సాంకేతిక పరికరాల ఉత్పాదన పరిశ్రమ ఏర్పాటుకు ఎపిఐఐసితో దరఖాస్తు చేసుకుంది. చానల్ ప్లే కంపెనీ ఎనిమిది ఎకరాల్లో రూ.70 కోట్ల వ్యయంతో కూడిన పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. చానల్ ప్లే పరిశ్రమలో ఎలక్ట్రానిక్ ఆడియో సంబంధిత సాంకేతిక పరికరాలను ఉత్పత్తి చేయనున్నారు. రూ.70 కోట్లతో 26 ఎకరాల విస్తీర్ణంలో అదీప్ ఫార్మా పరిశ్రమ ఏర్పాటు కానుంది. వీటి పరిధిలో సుమారు 9,600 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆల్ డిక్సన్ కంపెనీ ఫేజ్-2లో భాగంగా 35 షెడ్లను ఎపిఐఐసి నుంచి కొనుగోలు చేసింది. ఇప్పటికే ఆల్‌డిక్సన్ కంపెనీలో 3,500 మందికి ఉపాధి లభిస్తున్న సంగతి తెలిసిందే. ఫేజ్-2 కింద అదనపు విస్తరణతో మరో 1500 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కొప్పర్తి పారిశ్రామికవాడకు రెండు నెలల వ్యవధిలోనే రూ.150 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా పైప్‌లైన్, సంప్ పనులు పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. కొప్పర్తిలో పారిశ్రామిక అవసరాలకు నీటిలభ్యత అందుబాటులోకి రానుంది. మరో 200 కంపెనీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కేంద్రం నుంచి పర్యావరణ క్లియరెన్స్ లభిస్తే కొప్పర్తి పారిశ్రామికవాడ శీఘ్రగతిన పురోగతి సాధించే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా కేంద్రంలోని కూటమి సర్కారు భారతమాల ప్రాజెక్టులో భాగమైన విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక ఆర్థిక నడవాలో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడను అనుసంధాన పనుల వేగం, ఆర్థిక నడవాపురో గతిపై కొప్పర్తి పారిశ్రామికవాడ పురోగతి ఆధారపడి ఉందని చెప్పవచ్చు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మున్సిపల్ యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి కోరారు. మంగళవారం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 ఇస్తున్నారని చెప్పారు. తమకు రూ. 4 లక్షలు నుంచి రూ. 5 లక్షలు వరకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమరు కూడా గతంలో సమ్మె చేస్తుంటే మద్దతు ఇచ్చారని చెప్పారు. ఇంజినీరింగ్ కార్మికులకు పథకాలు అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వాటర్, లైటింగ్, టౌన్ ప్లానింగ్ మొదలగు ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న అన్ని సెక్షన్ వారు సమ్మె చేస్తారని పేర్కొన్నారు. జులైలో ఏరోజు అయినా సమ్మె చేస్తామని సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. సంక్షేమ పథకాలు విషయంలో గవర్నమెంట్ ఎంప్లాయిస్ అని చూపుతుందని చెప్పారు. స్పందించిన శ్రీనివాసరెడ్డి ఈ విషయం పై కలెక్టర్, సిఎం దృష్టికి తీసుకెళ్లి రాబోవు వారంలోపు చెబుతానని హామీ ఇచ్చారు. న్యాయం అయినా సమస్యలు తాను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కార్యదర్శులు ఆనందరావు, బ్రహ్మానందరెడ్డి, శ్యాం బాబు, అజాముద్దీన్ బాషా, రామ్ మోహన్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, హరీ నాయక్, సుబ్బయ్య, చిన్న, ప్రదీప్ కుమార్, రమేష్ బాబు, రాంబాబు, చెంద్ర రాయుడు, యల్లయ్య, నాగారాజు, గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

తల్లికి వందనం వర్తింపజేయాలి

తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధ) నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ కోరారు. మంగళవారం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు అర్హులైన కార్మికుల సంతకాలతో కూడిన దరఖాస్తులను నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డికి ఆయన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయాలని కోరారు. గత ప్రభుత్వం అమ్మబడి మున్సిపల్ కార్మికుల తల్లులకు వర్తింప చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కూడా తల్లికి వందనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మందకృష్ణ మాదిగకు సన్మానం

ప్రజాశక్తి కడప అర్బన్

హైదరాబాదులోని నాగోల్ శుభం ఫంక్షన్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 19న ఉదయం 10 గంటలకు వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మంద కృష్ణమాదిగ ః పద్మశ్రీ అవార్డు వచ్చిన శుభ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహిస్తున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న వికలాంగుల నాయకులు, కార్యకర్తలు జిల్లా, రాష్ట్ర, గ్రామ స్థాయిల నుంచి అత్యధిక వికలాంగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మోసం చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగాల పేరుతో తాను మోసం చేసినట్లు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర మహిళ అధ్యక్షులు కోటిపాటి సుబ్బమ్మ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆలిండియా ఫార్వడ్ బ్లాక్ రాయలసీమ జోన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది తాము ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలుచేసినట్లు చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తన పట్ల దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈ ఘటనతో సంబంధమున్న వారు మాట్లాడాలే తప్ప లేని వారు మాట్లాడటం తగదన్నారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై కేసు పెట్టడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగానికి కోరుతున్నానని తెలిపారు. తన కుమార్తె ఫొటోను సోషల్ మీడియాలో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆమెకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చిప్పగిరి మీనాక్షి, అరుణ కుమారి, సహచరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పక చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి తప్పక చేపట్టాలని వనిపెంట కెవికె శాస్త్రవేత్త ఎం. బాలకృష్ణ తెలిపారు. మంగళవారం మైదుకూరు మండల పరిధిలోని లెక్కలవారిపల్లెలో అనంతరాజుపేట బిఎస్‌సి ఉద్యానశాస్త్ర విద్యార్థులతో కలిసి రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు విత్తన ఎంపిక ముఖ్యమన్నారు. విత్తనాన్ని శుద్ధి చేసుకోవడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. పంటల పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు గ్రామీణ పని అనుభవ పథకం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట కీటక శాస్త్ర విభాగపతి డాక్టర్ రామయ్య, అధ్యాపకులు చంద్రమోహన్ రెడ్డి, రామకృష్ణ గ్రామ సర్పంచ్ జయభరత్ రెడ్డి, ఎంపిటిసి లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ శివప్రసాద్ రెడ్డి, అభ్యుదయ రైతులు ప్రతాపరెడ్డి, బాల నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు, శాస్త్రవేత్తలు

26న గండి క్షేత్రంలో వేలం పాటలు

ప్రజాశక్తి - చక్రాయపేట : జిల్లాలోని పుణ్య క్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 26 న వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గండి క్షేత్రంలో లోని ఆవరణంలో పూలు విక్రయం, టోల్గేట్ వసూలు, ఆలయంలో దుకాణాల గదులకు బాడుగ పాడుటకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూలు విక్రయానికి రూ. 5 లక్షలు, టోల్గేట్ వసూలకు రూ. 5 లక్షలు, దుకాణాల కోసం రూ. 3 లక్షల డిపాజిట్ చెల్లించాలన్నారు. . వేలంపాటలు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు లోబడి ఉంటాయన్నారు. 26న ఉదయం 10 గంటలకు గండి క్షేత్రం లోని కార్యాలయంలో వేలంపాటలు నిర్వహిస్తారన్నారు.

ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఐటిఐలో ఉత్తీర్ణులైన, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 20న నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జ్ఞాన కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఐటిఐ మార్కు లిస్టు, ఐటిఐ ఎన్‌టిసి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరుకావాలన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. వీరికి పరిశ్రమల్లో నెలకు రూ.10 వేలు, రూ.15వేలు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. వేతనంతో పాటు పిఎఫ్, మెడికల్ అలవెన్స్, క్యాంటీన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : ఎపి పిసిసి ఛీఫ్ షర్మిలకు చెందిన ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు సమన్వయ కర్త ఇర్ఫాన్ బాషా కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎపి పిసిసి ఛీఫ్ షర్మిలా ఫోన్ ను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తు బృందం గుర్తించిందన్నారు. షర్మిలకు చెందిన ఫోన్ ట్యాపింగ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేయడానికి ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నిత్యానంద రాజులు ఒక ప్రకటన తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 21 నుంచి 30 లోపు దరఖాస్తులు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏడీ పద్మజ

ప్రజాశక్తి - కడప : జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్‌ఓ) పద్మజ మంగళవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజుల కిందటే వైఎస్ఆర్ కడప జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ.. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు.

మెగా డిఎస్‌సి పరీక్షలకు 267 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతూ ఉన్నాయి. మంగళవారం ఉదయం 9 సెంటర్లు, మధ్యాహ్నం 3 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 1514 మంది హాజరు కావాల్సి ఉండగా 1307 మంది హాజరయ్యారు. 207 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 545 మంది హాజరు కావాల్సి ఉండగా 485 మంది హాజరయ్యారు 60 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2059 మంది హాజరు కావాల్సి ఉండగా 1792 మంది హాజరయ్యారు. 267 మంది గైర్హాజరయ్యారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప

ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్‌లో జెసి అతిథి సింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ్గా కలెక్టర్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తోందనన్నారు. జిల్లా లో యోగా మాసోత్సవాల్లో భాగంగా ఇది వరకే అనేక కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ఈ నెల 18న గండి కోట పర్యాటక ప్రాంతంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 5 వేల నుండి 6 వేల మందితో యోగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5,750 మంది యోగా శిక్షకుల ద్వారా ఇప్పటివరకు 5 లక్షల 60 వేల మందికి యోగ పై శిక్షణ, అవగాహన కల్పించామన్నారు. ప్రధాన వేదికగా వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఈనెల 21న యోగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇంకా నగరంలోని మున్సిపల్ మైదానం, ఆర్ట్స్ కళాశాల మైదానం, మరికొన్ని ప్రధాన రహదారుల్లో నిర్వహించాలని, అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, ప్రధాన పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో యోగా కార్య క్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ విశ్వేశ్వర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చెరుకూరి అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో డిఎంఎఫ్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపె ఆయా శాఖల ఇంజనీరింగ్,వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లా మినరల్ ఫండ్ ద్వారా నిర్మిస్తున్న వివిధ రకాల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన అన్ని రకాల నిర్మణాలను నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల సమన్వయ సహకారంతో ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఒ హాజరతయ్యా, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఏడుకొండలు, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులు రెడ్డి, గనులు భూగర్భ శాఖ డిడి వెంకట సాయి, హౌసింగ్ పీడీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పేద విద్యార్థులకు మహా గురుకులం

కడప అర్బన్ : జిల్లాలోని పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలుర మహా గురుకులం విద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు, విద్యార్థుల అడ్మిషన్ సంబంధిత అంశాలపె అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకులం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి గాను 460 మంది విద్యార్థులతో అడ్మిషన్లను 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఇతర పాఠశాలల్లో చదువుతూ నాణ్యమైన విద్యతో పాటు వసతి సదుపాయాలు కూడా కావాలని కోరుకునే అన్ని కేటగిరీలకు చెందిన పేద విద్యార్థులకు అడ్మిషన్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల అధికారులు విద్యార్థుల అవసరాలను గుర్తించి అవకాశం కల్పించాలన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో సీటు అందని అర్హులైన పేద విద్యార్థులకు మహా గురుకులంలో అడ్మిషన్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. సమావేశంలో బద్వేలు ఆర్‌డిఒ చంద్రమోహన్, సాంఘిక సంకేమ గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డిఇఒ షంషుద్దీన్, ఎస్ఎస్-ఎపిసి ఎ. రామలింగరాజు, సోషల్ వెల్ఫర్ డిడి సరస్వతి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి, జోయల్ విజయ్ కుమార్, కాంట్రాక్టు ఏజెన్సీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎల్ఐసి రీజనల్ మేనేజర్

మొక్కల పెంపకం సంస్కృతిగా అభివృద్ధి కావాలి

- ఎల్ఐసి రీజనల్ మేనేజర్ పి.జి.కుమార వైద్యలింగం

ప్రజాశక్తి - కడప అర్బన్

మొక్కలు పెంచడం ఒక బాధ్యతగా స్వీకరించి, ఒక సంస్కృతిగా అభివృద్ధి చెందితే ఉష్ణతాపం (గ్లోబల్ వార్మింగ్) వల్ల జరిగే అనర్థాలను మానవాళి ఎదుర్కోగలదని ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోన్ (హైదరాబాద్) రీజనల్ మేనేజర్ పి.జి. కుమార వైద్యలింగం అన్నారు. మంగళవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇఎస్‌జి పాలసీలో పర్యావరణ సమతుల్యత కాపాడడం కోసం పనిచేయడం ఒక ముఖ్యమైన బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను నిర్వర్తించడంలో ఎల్ఐసి అగ్రశ్రేణిలో ఉందని అన్నారు. 'ప్లాంట్ ఏ లైఫ్' పేరుతో విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ సంవత్సరం 46 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు పెరగడానికి కార్బన్ ఉద్గారాల వల్ల భూగోళం వేడెక్కడమే కారణమని అన్నారు. ఇది దేశంలో దుర్భిక్ష పరిస్థితులకు దారితీస్తుందని అన్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వాల ప్రయత్నాలకు పౌర సమాజం, ప్రభుత్వ సంస్థల సహకారం, భాగస్వామ్యం చాలా అవసరమని ఆయన అన్నారు. ఆ దిశగా అందరూ ఆలోచించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి. రవికుమార్ మాట్లాడుతూ కడప డివిజన్ ఇ ఎస్‌జి పాలసీ అమలులో గట్టిగా పని చేస్తున్నాం న్నారు. కార్యక్రమంలో ఒఎస్ మేనేజర్ సత్య ప్రసాద్, అధికారులు రమణ, మహేశ్వర్ రెడ్డి, సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశం సజావుగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 20న నిర్వహించే నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సజావుగా సాగేలా చూడా ల్సిన బాధ్యత అధి.కారుల దేనని కార్పొరేటర్లు పేర్కొన్నారు. మంగళవారం మేయర్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి భద్రత కల్పించి సమావేశం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్‌పిని కలసి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. 6 నెలలుగా నగరపాలక సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశాలు నిర్వ హించకుండా టిడిపికి తొత్తుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశం హాలును తెరవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకుండా కౌన్సిల్ సమావేశం హాలు బీగా లను కమిషనర్ వద్దనే ఉంచుకుని నియంతగా వ్యవహరిస్తున్నారని చెప్పా రు. గత సమావేశాలలో చేసిన తీర్మాణాలను కూడా అమలు చేయకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరపాలక సంస్థకు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. జనరల్ ఫండ్ ద్వారా ప్రజలు కట్టిన పన్నును వివిధ కార్యక్రమాలకు వాడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనులు జనరల్ ఫండ్స్‌తోనే చేస్తున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పాకా సురేష్, కె.బాబు, శివకోటిరెడ్డి, బాలస్వామి రెడ్డి, మక్బూల్ బాషా, రామ లక్ష్మణ రెడ్డి, డిస్ జానీ, ప్రసాద్ రెడ్డి, డివిజన్ ఇన్‌ఛార్జులు బసవరాజు, శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, ఐస్ క్రీం రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి కార్పొరేటర్లు



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పాలస్తీనాకు సంఘీభావంగా ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలస్తీనాకు సంఘీభావంగా సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కడప పాత బస్టాండు పూలే సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ యుద్ధం వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం అత్యధికంగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం వల్ల నష్టం తప్ప లాభం లేదని విమర్శించారు. యుద్ధానికి చిన్నపిల్లలు, వృద్ధులు, పెద్దలు అనే తేడా ఏమీ ఉండదన్నారు. సామ్రాజ్యవాదులు ఆదాయమే లక్ష్యంగా పని చేస్తారని తెలిపారు. అలాంటి వాటికి స్వస్తి చెప్పాల్సినటువంటి అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేయడం సరైనది కాదన్నారు. ఒకరిపై ఒకరు యుద్ధాలు చేసుకోవడం అనేది చాలా దుర్మార్గమన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. సామ్రాజ్యవాదం ఆదాయమే వనరుగా యుద్ధాలను ఉసిగొల్పడం పనిగా ఉంటుందని ఆరోపించారు. కనుక పాలస్తీనాకు సంఘీభావంగా ఆందోళన చేయడం సంతోషమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, ఉదయ్, మహేష్, స్టీఫెన్,ఇమామ్, చాంద్ బాషా, శివ, హరి, ప్రభాకరు పాల్గొన్నారు.

ఘనంగా 'చిలకమర్తి' వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రసిద్ధమైన తెలుగు నాటకాలలో ఒకటైన గయోపాఖ్యానం చిలకమర్తి లక్ష్మీనరసింహానికి శాశ్వతమైన కీర్తినార్జించి పెట్టిందని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్ లో రచయితల సంఘం ఆధ్వర్యంలో చిలకమర్తి వర్ధంతిని నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయసులో రాసిన గయోపాఖ్యానం నాటక ప్రతులు అప్పటి కాలంలోనే లక్షకు పైగా అమ్ముడుపోవడం విశేషమని తెలిపారు. ఈ నాటకం వేల ప్రదర్శనలకు నోచుకుందని, అందులో ఉన్న 'అల్లుడా రమ్మని' 'అనిన మాటను తప్పుట' 'చనినారార్పురు చక్రవర్తులు' మొదలైన పద్యాలు తెలుగువారి నాలుకలపై నాట్యం చేస్తుంటాయని చెప్పారు. కవిగా, రచయితగా, ప్రసిద్ధ నాటక కర్తగా,సంఘసంస్కరణ వాదిగా, విద్యావేత్తగా ఆయన చేసిన కృషికి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ 'బిరుదుతో సత్కరించిందన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఆయన కీచకవధ అనే నాటకంతో ప్రారంభించి గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం,పారిజాతాపహరణం, నల చరిత్ర నాటకాలతో పాటు గణపతి, రామచంద్ర విజయం, హేమలత, అహల్యా భాయి, పార్వతీ కళ్యాణం మొదలైన నవలలు రాశారని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు జీవకళ సత్యనారాయణ మాట్లాడుతూ చిలకమర్తికి అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేదని, ఆయన స్వీయ చరిత్రలో తన జీవితకాలంలో జరిగిన అనేక సంఘటనలను సూక్ష్మ అంశాలతో సహా వివరించి చెప్పడం మహాద్భుతమని పేర్కొన్నారు. నిమ్న జాతుల వారి కోసం అప్పట్లోనే ఒక ప్రత్యేక పాఠశాలను ఏర్పాటుచేసిన ఘనత చిలకమర్తికే దక్కుతుందన్నారు. అనంతరం రచయితల సంఘం వారు చీమల పెంట గ్రామానికి చెందిన ప్రసిద్ధ రంగస్థల నటుడు గుర్రప్పను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రసిద్ధ రంగస్థల కళాకారులు ప్రకాశం, బ్యాంక్ గంగయ్య, ఎం ఏ ఎస్ సత్యనారాయణ, బాల గంగయ్య, సాహితి మిత్రులు కొత్తపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.



చిలకమర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు



వేరుశనగ పంటను నూర్పిడి చేస్తున్న రైతు

గిట్టుబాటు ధర.. రైతులకు ఊరట

ప్రజాశక్తి- ఖాజీపేట

వ్యవసాయ రంగంలో రోజురోజుకూ నూనె గింజల ఉత్పత్తి సాగు గణనీయంగా తగ్గుతుంది. వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వు7, పత్తి తదితర పంటల సాగు ప్రశ్నార్థకగా మారుతోం ది. పత్తి సాగు మాత్రం ఇంతవరకు రైతులు ఆదరిస్తున్నారు. మిగతా పంటలైన పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలను తక్కువగా సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరగడం ఒక కారణమైతే, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం మరో కారణమని రైతులు భావిస్తున్నారు. రైతుల సమస్యలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించింది. ఏటా ఖరీఫ్ ప్రారంభానికి ముందు గిట్టుబాటు ధరల ప్రకటన చేస్తుంది. గిట్టుబాటు ధరలను దృష్టిలో ఉంచుకోనైనా రైతులు పంటలు సాగు చేస్తారని, ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మే, జూన్ మసాలాలో మద్దతు ధర ప్రకటిస్తుంటుంది. ప్రస్తుతం వేరుశనగ క్వింటా రూ. 6783, ఈ ఏడాది ధర రూ. 7263 అంటే క్వింటా పై రూ. 480 ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది నుంచే కొత్త ధరలు అమలులోకి వస్తాయని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పట్ల రైతులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు సాగు విస్తీర్ణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొంటున్నారు.

బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్

ప్రజాశక్తి - వేంపల్లె



వై.ఎస్.జగన్‌తో సుదర్శన్ (ఫైల్)

వైసిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోట్లూరు సుదర్శన్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. వేంపల్లె మండలంలోని తాళ్ళపల్లె గ్రామానికి చెందిన కోట్లూరు సుదర్శన్ వైసిపి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించడంతో అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కోసం పని చేసిన వారందరికి పదవులను కట్ట పెట్టారు. ఈ నేపథ్యంలో ఇటీవల చేపట్టిన కమిటీ విభాగాల ఎంపికలో కోట్లూరు సుదర్శన్‌ను గుర్తించి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవిని అప్పగించారు. తన నియామకానికి సహకరించిన వారికి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలోని అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు చెప్పారు. తనకు పదవి కట్టబెట్టినందుకు పార్టీ కోసం మరింత కష్టపడి పని చేస్తానని చెప్పారు.

వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శిగా చల్లా బాలాజీ

వైఎస్ఆర్‌టియుసి విభాగం ప్రధాన కార్యదర్శిగా వేంపల్లెకు చెందిన చల్లా బాలాజీని పార్టీ అధిష్టానం నియమించింది. ఇటీవల వైసిపి పార్టీ అధిష్టానం జిల్లా కమిటీల విభాగాలను ఎంపిక చేసింది. ఈ నైపథ్యంలో పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శిగా చల్లా బాలాజీని నియామకం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్మిక విభాగానికి ప్రధాన కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ, పార్టీ పటిష్టతతో పాటు కార్మికులకు ప్రయోజనం కలిగించే విధంగా పని చేస్తానని చెప్పారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ ఆర్. శ్రీనివాసులుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణంలో మెడికల్ షాపుల సిబ్బంది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అటువంటి వారిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖా అధికారులు డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా చట్ట నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని మందుల దుకాణాల యాజమాన్యాలు ఇష్టానుసారంగా మందులు ప్రజలకు ఇస్తున్నారని అన్నారు. వార్డుల్లో,గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లల్లో మందులు ప్రజలకు తెలిసి, తెలియక ఇస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

వ్యాధులపై అసెస్మెంట్ సర్వే

ప్రజాశక్తి- ఖాజీపేట : మండల పరిధిలోని మిడుతూరు ఆరోగ్యం కేంద్రం పరిధిలోని బక్కాయపల్లి గ్రామంలో నాన్ కమ్యూనికబుల్ వ్యాధులపై ఎన్‌సిడి 3.0 క్వాలిటీ అసెస్‌మెంట్ సర్వే నిర్వహించారు. సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ చరిత, డాక్టర్ లక్ష్మీదేవి సర్వేను పరిశీలించారు. రక్త పోటు చక్కెర బరువు వంటి అంశాలను పరిశీలించారు. అనారోగ్యంతో ఉన్న వ్యాధిగ్రస్తులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ వైద్య సిబ్బంది, వైద్యాధికారి డాక్టర్ సుమన్, సిబ్బంది పెంచలయ్య, ఏఎన్ఎం ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- ఖాజీపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఇప్పటివరకు వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదదని గతంలో వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేసిందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి. రాఘవరెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖాజీపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఏడాది అవుతున్నా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు ఇంత వరకు మంజూరు చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం సమయానికి భరోసా కార్యక్రమం కింద పెట్టుబడికి నగదు జమ చేసే వారమన్నారు. రానున్న రోజులలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని వారన్నారు.

బొడ్డురాచన్న వీధిలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక బొడ్డు రాచన్న వీధిలోని శ్రీరా ముని ఆలయం వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. వేంపల్లెలోని బొడ్డు రాచన్న వీధిలో ఇటీవల నూతనంగా సీతారాముల ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించి 41 రోజులు కావడంతో మంగళవారం సీతారాముల ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించి ప్రజలకు అన్నం వడ్డించారు. సీతారాముల విగ్రహాలకు మహిళాలు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొత్తూరు రెడ్డయ్య, బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, రాటాల శ్రీకాంత్, ఆదినారాయణతో పాటు గౌరి దేవి బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెరువు మట్టిని వదలని నాయకులు

ప్రజాశక్తి - కడప : పాత కడప చెరువు మట్టిని సైతం వదలకుండా టిడిపి నాయకులు దోచుకుంటున్నారని ఎంఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప నగరంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన పాత కడప చెరువు అని అన్నారు. ఇవాళ కొంత మంది నాయకులు మట్టిని కూడా వదలకుండా ధనార్జనే ధ్యేయంగా సంపాదించుకుంటున్నారు అని విమర్శించారు. టిప్పర్ తిరిగే ప్రదేశం దేవుని కడప చెరువు నుంచి బైపాస్ వరకు మట్టిని అన్యాయంగా అక్రమంగా తరలిoచడం దారుణం అన్నారు. ఈ టిప్పర్లు తిరిగే ప్రదేశంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఉండటం వల్ల విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమి జరిగినా దానికి పూర్తి బాధ్యత , పర్మిషన్ ఇచ్చిన అధికారులది, టిడిపి ప్రభుత్వానిదేనని తెలిపారు.

ఇంటర్ కళాశాలను ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం మండలంలోని ప్రభుత్వ హై స్కూల్ ప్లస్ ఇంటర్ కళాశాల ప్రారంభించాలని, నాడు- నేడు, నాబార్డ్ కార్యక్రమంలో భాగంగా అనేక ప్రభుత్వ స్కూల్స్, కళాశాలల భవనాలు పూర్తిచేసి విద్యార్థులు విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహులు, జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన హై స్కూల్ ప్లస్ ఇంటర్ కళాశాలను ఒకక సంవత్సరం నిర్వహించి తరువాత నిర్వహించలేదని చెప్పడం సిగ్గుచేటు అని చెప్పారు. దీని కారణంగా అక్కడ చదివే విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కళాశాల పైన దృష్టి పెట్టాలని సూచించారు. కళాశాలను ప్రారంభించి అధ్యాపకులను నియమించాలన్నారు. మండల కేంద్రంలోని అనేక హై స్కూల్, యూపీ స్కూల్ పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. నాడు- నేడు నాబార్డ్ కార్యక్రమంలో భాగంగా అనేక పాఠశాలలో భవనాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి కనబడుతుందని చెప్పారు. పాఠశాలలు పూర్తి చేయకపోవడంలో విద్యాశాఖ అధికారులు నాయకుల వైఫల్యం చెందారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్నత విద్య ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ పాఠశాల భవనాలను పూర్తి చేసే విధంగా చూడాలని చెప్పారు. తోట్లపల్లిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే భవనాలు, వసతులు పూర్తయినప్పటికీ ఇంతవరకు ప్రారంభించకపోవడం చాలా దారుణం వీటిపైన విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్య మొండివైఖరి వీడి వెంటనే గురుకుల పాఠశాలను ప్రారంభించాలని వారు కోరారు. లేనిపక్షంలో మండల జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'రాచమల్లు' లాంటి అవినీతిపరుడిని చూడలేదు

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తన రాజకీయ జీవితంలోనే రాచమల్లు ప్రసాద్‌లాంటి అవినీతి వ్యక్తిని చూడ లేదని, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పదేపదే తనపై తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అవి సత్యాలు కావని, ప్రొద్దుటూరు ప్రజలు ఎవరూ ఆయన మాటలు నమ్మే స్థితిలో లేరని వివరించారు. ప్రొద్దుటూరులో ఒక ప్రాంతంలో రాచమల్లు కుటుంబానికి 1.08 సెంట్ల స్థలం ఉంటే ఆ పక్కనే నికల్సన్ అనే ఒక బ్రిటిష్ వ్యక్తి చర్చి కోసం కొన్న భూమిని దొంగ డాక్యుమెంట్లు సృష్టించి బినామీ పేర్లతో ఆక్రమించి ఫ్లాట్లు వేసి, విక్రయించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. తాను కాంట్రాక్టర్లను బెదిరించలేదని ఒకవేళ రాచమల్లు వద్ద ఆధారాలుంటే నిరూపించాలన్నారు. నిమ్మకాయల సుధాకర్ రెడ్డి స్థలం చెరువు భూమి అని తాను అపోహ పడి ఆ స్థల విక్రయానికి అడ్డు పడిన మాట వాస్తవమేనని, హైకోర్టు ఉత్తర్వుల తర్వాత తాను అడ్డు పడలేదని పేర్కొన్నారు. అతనే స్వయంగా తమకు ఎటువంటి నగదు అందించ లేదని చెప్పిన మాట గుర్తించాలన్నారు. డిఎడబ్ల్యూ కళాశాల విషయంలో తాము అక్కడ భూమి కొన్నామని, అక్కడ రాచమల్లు ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో అర్జీల ద్వారా పని ఆపే యత్నం చేస్తే వ్యాపారులకు నష్టం రాకూడదని తాము కూడా తమ వాటా మేర అతనికి ముడుపులు చెల్లించామని స్పష్టం చేశారు. తన కుమారుడు, ప్రొద్దుటూరులో పలువురు ఆర్యవైశ్యులు నేటికి హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ఆ లావాదేవీలలో పలు సమస్యలున్నాయని, కానీ తాము ప్రొద్దుటూరు లో ఏ ఆర్యవైశ్యునికి అప్పు వున్నామో తెలపాలన్నారు. తమ చెల్లెలు కుటుంబం రాజకీయంగా చేసిన హత్యా సంఘటనలు, దాడులు తమకు ఆపాదించడం సరికాదన్నారు. కొందరు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఇ.వి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 2019లో జగన్ ప్రత్యేక హోదా తెస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని, పోలవరం, అమరావతి పూర్తి చేస్తామని, కడప స్టీల్ ప్లాంట్ కు 3 సార్లు శంకుస్థాపన చేసి పూర్తి చేయకుండా వదిలేసి హామీలు విస్మరించలేదా అని ప్రశ్నించారు కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనందభార్గవరెడ్డి, గురివిరెడ్డి, మాజీ జబట్పుఒగొసొ వెల్లాల భాస్కర్ పాల్గొన్నారు.

పశు వైద్యాధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బదిలీపై వెళ్లిన నిత్యానంద, అధికారులను ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీలు జరిగినటువంటి స్థానాల్లో కొత్త పశు వైద్యాధికారులు నియమితులయ్యారు. పెద్దిరాజు పల్లి పశువైద్యశాలకు మహేశ్వర్ రెడ్డి, ప్రభలవీడు పశు వైద్యశాలకు డాక్టర్ హేమలత, బి.కోడూరు పశు వైద్యశాలకు డాక్టర్ స్నిగ్ధ ప్రణీత బదిలీ అయ్యారు. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన డాక్టర్ లక్ష్మీ నరసయ్య, డాక్టర్ భరద్వాజ్ కృష్ణ, డాక్టర్ నిత్యానంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని పశు వైద్యాధికారులు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్లు (ఎఎచ్ఎలు) గోపాలమిత్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 89 మంది యువత ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



హాజరైన కంపెనీ ప్రతినిధులు

జాబ్ మేళాలో 89 మంది యువతీ యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం పట్టణంలోని న్యాక్ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. అర్బన్ సిఐ చాంద్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెలా జిల్లాలోని నియోజకవర్గలలో జరుగుతాయని వివరించారు. కార్యక్రమానికి 10 సంస్థల అధికారులు హాజరయ్యారని వివరించారు. మొత్తం 276 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 89 మంది ఎంపికైనట్లు న్యాక్ బిల్డింగ్ ఇన్‌ఛార్జి చెన్నకేశవ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి ఎస్ఎసిడిసి కో-ఆర్డినేటర్లు పృధ్వి, దివాకర్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



సామాజిక తనిఖీలో అధికారులు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఉపాధి హామీ పథకం సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి 1021 పనులకు సంబంధించి రూ7.2 కోట్ల పనులు చేశారన్నారు. ఈ పనులలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో ఉపయోగపడే పనులను గుర్తించి చేయాలన్నారు. రైతుల అభ్యున్నతి కోసం పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టిందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు పశువుల కోసం మినీ గోకులాలు, నీటి తొట్లను ఏర్పాటు చేశారన్నారు. మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా నిధులను విడుదల చేస్తున్నారు. ఈ నిధులను సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఒ జుబేదాబేగం, ఎస్‌టిఎం లోకేష్‌రెడ్డి, ఏపీడీ సోమశేఖర్ రెడ్డి, ఎస్ఆర్‌పి నాగరాజు, ఎపిఒ పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకం కోల్పోయిన ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సూపర్ 6 పథకాలను అమలు చేయడంలో టిడిపి విఫలం కావడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే ఎస్ రఘురామి రెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు వైసిపి కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాటలకు మోసపోయామని ప్రజలకు అర్థమయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కుంటూ పడిందని ప్రతి ఒక్కరూ చర్చిస్తున్నారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికలలో హామీ ఇచ్చి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. నూరు అబద్ధాలు చెప్పి అయినా అధికారంలోకి రావాలనుకునే వ్యక్తి చంద్రబాబు అన్నారు. సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజల ఆశలను అడియాసలు చేశాడన్నారు. వెన్నుపోటు కార్యక్రమానికి ప్రజలు తండోపతండాలుగా రావడంతో తల్లికి వందనం వేశారన్నారు. అయితే తల్లికి వందనం లో కూడా మోసం ఉందన్నారు.ఎంతమంది విద్యార్థులు ఉన్నారు ఎంతమందికి వేశారు అనే వివరాలు తమ దగ్గర ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. అనంతరం జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిచైర్మన్ రామ గోవిందరెడ్డి, చాపాడు ఎంపిపి టి.లక్షుమయ్య, దువ్వూరు ఎంపిపి జయ చంద్రా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, వైసిపి నాయకులు శివరాం, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

85 శాతం పథకాలు అమలు చేశామని చెప్పడం విడ్డూరం

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు 85 శాతం అమలు చేశామని చెప్పడం అపద్ధమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు సంబంధించి 3 హామీలు ఇస్తే అందులో ఒక హామీ మాత్రమే ఇప్పటివరకు అమలైందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు సంబంధించి కొందరేమో మొత్తం అన్ని అమలు చేశామని గొప్పలు చెప్పడం శోచనీయం అన్నారు. ఏడాదిలో 40 శాతం మాత్రమే అమలు చేసిందని చెప్పారు. అమలు చేసిన వాటిని చూస్తే సామాజిక పెన్షన్ల పెంపును అమలు చేశారని చెప్పారు. తల్లికి వందనం పథకం ఏడాది తర్వాత అమలు చేశారని చెప్పారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పెన్షన్ పథకాలు అమలు కాలేదని చెప్పారు. మహిళలకు మూడు హామీలు ఇస్తే ఒకటి మాత్రమే అమలు అవుతున్నట్లు చెప్పారు. 85 శాతం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడానికిప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలే అన్నారు. కాబట్టి అమలు చేయని హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. 46 వేల మంది రైతులకు 1.18 కోట్ల ధ్యానం బకాయిలు రెండు నెలలుగా పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. జొన్నలకు సంబంధించి 76 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. రాగులకు సంబంధించి 33 లక్షలు పెండింగ్‌లో బకాయిలు ఉన్నాయాని చెప్పారు. అప్పు చెల్లించని కారణంగా శిరీష అనే మహిళను చెట్టుకు కట్టేసి బంధించడం సిగ్గు చేటు అన్నారు. ఇలాంటి ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో జరగడం హేమమైన చర్య అన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తులసిరెడ్డి కోరారు.



వల్లూరు : రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయ పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- వల్లూరు

రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుగారిపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ ,వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత ,చిరు సంచులు పథకం గురించి వివిధ రకాల పంటల్లో రకాల ఎంపిక విత్తన శుద్ధి, ప్రాముఖ్యత నూతన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. సకాలంలో సాగులో సలహాలు సూచనలు రైతులకు అందించి , తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందేటట్లు తీర్చిదిద్దే అధిక ఆదాయం వచ్చేలా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సురేఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. **సింహాద్రిపురం** : ప్రతి రైతూ పెట్టుబడి వ్యయం తగ్గించేలా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కళ్యాణ్ కుమార్ సూచించారు. మంగళవారం సింహాద్రిపురం ఆర్ఎస్‌కెలో మండలంలోని వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులు విత్తనం వేసేటప్పుడు వేరు కుళ్ళు, ఎండు తెగులు రాకుండా విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయం ఇంచార్జ్ శ్రీనివాసులు, ఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు. **ముద్దనూరు :** రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. ఉప్పలూరులో మంగళవారం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. **వేముల :** స్థానిక చాగలేరు- గుండ్లపల్లి గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు రైతుల సాగు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో రసం పిలిచే పురుగుల నివారణకు సస్యరక్షణలో భాగంగా ఎల్లో ట్రాప్స్ ఎకరాకు 10 అమర్చుకోవాలి అని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒసురేష్, ఎంపిఇఒ లక్ష్మి, గ్రామ సర్పంచ్ అర్జున్, రైతులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** నల్లపురెడ్డిపల్లి గ్రామ రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాధికారి అధ్యక్షతన పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే ప్రమాదముందని, గెలవేయని చెట్లకు నివారణ మందలు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ భాస్కర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయకులు రాఘవ, కీర్తన, మల్లికార్జున, ఎలీషా పాల్గొన్నారు **వేంపల్లె :** విత్తన శుద్ధి చేసి రైతులు పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ శాఖ శివశంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గిడ్డింగివారిపల్లె, బక్కన్నగారిపల్లె, టి. వెలమవారిపల్లె గ్రామాల్లో పంటల్లో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారులు చేపట్టారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, వ్యవసాయ పరికరాలు అర్హులైన రైతులు అందరికి వస్తాయని ఎఒ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప, పత్తి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు. **లింగాల :** పంట దిగుబడి సమయంలో చీడపీడలు ఆశించి పంట నష్టం కలిగిస్తాయని వాటిని తుది దశలోనే రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి అని వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని లోపట్నూతలలో పొలం పిలుస్తుందని కార్యక్రమం నిర్వహించారు. మినుము పంట సాగును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వివేక్ , రైతు సేవా సిబ్బంది రాణి, పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటలు వేసుకోవాలని పేర్కొన్నారు జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అపరాజుపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఈశ్వర్‌రెడ్డి, ఎం ఐఎఒ శ్రీధర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి సురేష్, రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** పంటల సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణ మూర్తి తెలిపారు. మండల కేంద్రమైన చాపాడు, పల్లవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మ లత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్ బీ ,టిడిపి నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, విఎఎ లు గోపి రామ్, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు. **మైదుకూరు :** మండలంలోని సరస్వతి పేట, గుంటూరు కొట్టాల్ లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఇ. బాల గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఎలాంటి ఇకెవైసి అవసరం లేదన్నారు. బిల్లులు ఇవ్వని లూజు విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని సూచించారు.



సింహాద్రిపురం : పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు